## క్లుప్తంగా

### భూలోకమాతను దర్శించుకున్న కె.కె.రాజు


భూలోకమాత పూజల్లో పాల్గొన్న కె.కె.రాజు, సాడి పద్మారెడ్డి

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని భూలోకమాత ఆలయం వద్ద జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, రేసపువానిపాలెం గ్రామాధ్యక్షులు బేరి గురుమూర్తిరెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, ఉత్తర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి, జగదీష్, లావణ్య, శ్రీనివాసరెడ్డి, జగన్, రాముడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### విశేషంగా అన్నసమారాధనలు


అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

**మురళీనగర్:** జీవీఎంసీ 49వ వార్డు నెహ్రూనగర్‌లో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా కిరణ్ బాయ్స్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

### భారీ అన్నదానం


51వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

**మర్రిపాలెం:** జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లో శ్రీ వరాహలక్ష్మి నరసింహ ఆటో స్టాండ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. సరస్వతీ దేవి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

### 'శ్రీకృష్ణార్జున యుద్ధం' ప్రదర్శన 7న

**మర్రిపాలెం:** విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 7న శ్రీకృష్ణార్జున యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నట్టు పోర్టు పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు అథారిటీ ఆర్థిక సాయంతో సాలిగ్రామపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు నాటకం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులు, పెన్షనర్లు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు

**మద్దిలపాలెం:** మహిళా శిశు సంక్షేమ శాఖ, విశాఖ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సీడీపీవో కె.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ 43వ వార్డులోని ఎం.టి.పాలెం, 23వ వార్డు మద్దిలపాలెం-1 సెంటర్లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆయా ప్రాంతాల్లో స్థిర నివాసులై ఉండాలని, 35 ఏళ్లలోపు వయసు, పదో తరగతి పాసై ఉండాలన్నారు. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

### జోన్-5 పీజీఆర్‌ఎస్‌కు రెండే వినతులు

**కంచరపాలెం:** జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 02 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వినతులను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.


బొమ్మల కొలువులో సరస్వతీ దేవిగా దుర్గాదేవి


రావణ దర్బారులో హనుమంతుడు


రామాయణ ఘట్టాలను తెలిపే బొమ్మలు


నరసింహనగర్‌లోని కొఠి శ్రీలత ఇంట్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

# ఆధ్యాత్మిక సమాహారం బొమ్మల కొలువు

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువులు
- హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు
- రామాయణ, భారత, భాగవతాల్లోని ఘట్టాలు భావితరాలు తెలిసేలా ఏర్పాటు
- మగువల నైపుణ్యానికి మచ్చుతునక

**సీతంపేట:** హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, పురాణాల విశిష్టతను భావితరాలకు అందించేలా నగరంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చాలా మంది తమ ఇళ్లల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తుంటారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, రామాయణ, భారత, భాగవతాల్లోని ముఖ్య ఘట్టాలను భావితరాలకు అందించాలన్నదే వీటిలో దాగి ఉన్న అంతరార్థం. పురాణ, ఇతిహాసాల్లోని ముఖ్య ఘట్టాలను కళ్లకు కట్టేలా నరసింహనగర్, లలితానగర్, నౌరోజీ రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ విశేషంగా ఆలరిస్తున్నాయి.

**కళ్లకు కట్టినట్టు అద్భుతంగా ప్రదర్శన**

నరసింహనగర్ రైతుబజార్ సమీపంలో పాత ఎస్‌బీఐ ఏటీఎం పక్కన నివసిస్తున్న కొఠి శ్రీలత తన కోడళ్లు అర్చన, ప్రేమలత, కుమార్తె శ్రీచిత్రలతో కలిసి వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అబ్బురపరుస్తోంది. చూడచక్కని బొమ్మలతో త్రేతా, ద్వాపర యుగాల్లో రాముడు, కృష్ణుడు జన్మ వృత్తాంతం తెలిపేలా బొమ్మలను చూటముచ్చటగా ప్రదర్శించారు. తొమ్మిది రకాల భక్తి మార్గాలైన శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం ఘటాలను బొమ్మల రూపంలో చక్కగా ప్రదర్శించారు. తిరుపతి బ్రహ్మోత్సవాల ఘట్టాలు, సుప్రభాత సేవను కళ్లకు కట్టినట్టు బొమ్మలతో చూపించారు. రామాయణంలోని ముఖ్య ఘట్టాలైన పుత్రకామేష్టి యాగం, రాముని జననం, పర్ణశాల, సీతాపహరణం, అహల్యా శాపవిమోచనం, జటాయువు, కుంభకర్ణుని నిద్ర లేపడం, రావణ సంహారం అద్భుతంగా ప్రదర్శించారు. నవదుర్గలు, దశావతారాలు, అష్టలక్ష్ములు, అరుదైన అనంత పద్మనాభ స్వామి, ఉడిపి కృష్ణుడు, శృంగేరి శారదా దేవి, హయగ్రీవుడు ఇలా ఎన్నో బొమ్మలు కొలువు దీరాయి. ప్రతి బొమ్మ ఒక ఆధ్యాత్మిక విషయాన్ని తెలియజేస్తుంది.

**36 ఏళ్లుగా ఏర్పాటు**

**నేటి తరం పిల్లలకు పురాణాలు, ఆధ్యాత్మిక విషయాలు, మన సంస్కృతి తెలియజెప్పాలనే** 36 ఏళ్లుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 2 వేలకు పైగా ఉన్న బొమ్మలను అమర్చడానికి వారం రోజులు పడుతుంది. నవరాత్రులు మొదలయ్యే పాడ్యమి నుంచి దశమి వరకు సందర్శనార్థం బొమ్మల కొలువు ఉంటుంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఎవరైనా వచ్చి బొమ్మల కొలువు చూడవచ్చు. రోజుకొక అలంకారంలో దుర్గాదేవిని అలంకరించి పూజిస్తున్నాం.

– కొఠి శ్రీలత, ప్రేమలత, నరసింహనగర్


భక్త ప్రహ్లాదుడికి నరసింహస్వామి ప్రత్యక్షం


రామ రావణ యుద్ధ ఘట్టం


నౌరోజీ రోడ్డు ప్రాంతంలోని జి.శాంతిరావు ఇంట్లో బొమ్మల కొలువు


దశావతారాలు, అష్టలక్ష్మీదేవి బొమ్మలు


బొమ్మలతో ఆకట్టుకుంటున్న పల్లె వాతావరణం


శ్రీకృష్ణుడి విశ్వరూపం

## కొలువుదీరిన అరుదైన బొమ్మలు

నగరంలోని నౌరోజీ రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న జి.శాంతిరావు తన ఇంట్లో 20 ఏళ్లుగా దసరా నవరాత్రుల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన బొమ్మలతో ఆధ్యాత్మిక విషయాలను చాటిచెప్పేలా ప్రదర్శించారు. పాడ్యమి నుంచి నవమి వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. సంగీత త్రిమూర్తులు త్యాగరాజు, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి వంటి అరుదైన బొమ్మలు కొలువుదీరాయి. కృష్ణుడి జన్మ వృత్తాంతం తెలిపేలా దేవకి వసుదేవులను చెరశాలలో పెట్టిన దగ్గర నుంచి, యమునా నది దాటుతున్న వసుదేవుడు, పూతన సంహారం, గోవర్ధన గిరిధారి, కాళీయ మర్దనం, బృందావనం, ద్వారక, గీతా బోధన, విశ్వరూపం ఘట్టాలు ఆకట్టుకున్నాయి. పల్లె వాతావరణం, వివాహంలోని ఘట్టాలు, , తిరుపతి బ్రహ్మోత్సవాలు, దశావతారాలు, అష్టలక్ష్ములు, నవదుర్గల బొమ్మలు కొలువుదీరాయి. పురందరదాసు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, ఆదిశంకరులు, చంద్రశేఖరేంద్ర, అన్నపూర్ణాదేవి, గాయత్రిమాత, అనంత పద్మనాభస్వామి, భక్తి మీర, కామాక్షిదేవి, అర్ధనారీశ్వరుడు, మరపాచి బొమ్మలు ఇలా ఎన్నో అరుదైన బొమ్మలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానికులందరూ వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– సీతంపేట


నవ దుర్గల బొమ్మలు

## వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకంపై చర్చ


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుతో చర్చిస్తున్న మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా

**మహారాణిపేట:** మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఖాదర్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర, జిల్లా, వార్డు కమిటీల నియామకాలపై చర్చించారు. సమావేశంలో పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బర్కత్ అలీ, జోనల్ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ.కరీం బాష, రాష్ట్ర కార్యదర్శి హసన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మురళీనగర్ యూపీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

**మురళీనగర్:** స్వస్థ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. మురళీనగర్ యూపీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించి రోగులను పరామర్శించారు. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల్లో పాల్గొని వివిధ రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అక్టోబర్ 2 వరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి పలు సూచనలిచ్చారు. మాతా శిశు సేవలు, గర్భిణుల సేవలు సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. టీబీ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్యామలదీపిక, సునీల్ అగర్వాల్ తదితరులు ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, బీజేపీ నాయకులు జగపతిరావు, రామరాజ్యం, రత్నకుమారి, విజయ చంద్రుడు, ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో..



ఆడపడుచులు ఆనందోత్సాహాలతో పూల పండగ చేశారు.. ఆటపాటలతో గౌరమ్మను ఆరాధించారు. కోలాటాలతో కోలాహలంగా బతుకమ్మ వేడుక జరుపుకున్నారు. శుభప్రదమైన పూలనే గుత్తులుగా గుచ్చి, అందంగా పేర్చి దేవతగా అర్చించడమే బతుకమ్మ పండగ. ఈ వేడుకను మురళీనగర్‌లోని బృందావన్ పార్కు వద్ద సోమవారం సాయంత్రం ఘనంగా జరిపారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఈ ఉత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పాటలు పాడి, కోలాటాలతో సందడి చేశారు.

– మురళీనగర్

## చదువుల తల్లికి ప్రణమిల్లి..

**సరస్వతీ దేవిగా పూజలందుకున్న దుర్గమ్మ**

**సీతంపేట:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. మూలా నక్షత్రం సందర్భంగా ఎనిమిదో రోజు సోమవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన పద్మావతి అమ్మవారిని విద్యాలక్ష్మీ దేవిగా, లలితాదేవిని సరస్వతి దేవిగా అలంకరించారు. చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, శ్రీచక్రనవావరణ, సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన, చండీ హోమం చేశారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేదమంత్రాల నడుమ సరస్వతీ దేవి, గాయత్రి దేవి హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. విద్యార్థుల చేత సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతి పూజ చేయించారు. మధ్యాహ్నం అన్నదానలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పీఠంలో కాళీ హోమం, బగళాముఖి హోమం జరుగుతాయని, ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు దర్శనమిస్తారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- సీతంపేట పార్వతీశ్వరాలయంలో సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన పార్వతీ దేవికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన చేశారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు జరిపారు. విద్యార్థుల చేత సామూహిక సరస్వతీ దేవి పూజ చేయించారు.
- పాత రేసపువానిపాలెంలో స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా తెలుపు రంగు చీరలో చూడముచ్చటగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించి కుంకుమ పూజలు చేశారు. మంగళవారం దుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

**ప్రత్యేక పూజలు**

**మర్రిపాలెం:** మాధవధార సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనక దుర్గ ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పిల్లలు, పెద్దలతో సరస్వతీ దేవికి పూజలు, హోమం చేయించారు.

**లలితాంబికకు సహస్ర కుంకుమార్చన**

**మురళీనగర్:** మురళీనగర్ రామాలయంలో కొలువైన లలితాదేవిని సరస్వతీ దేవిగా అలంకరించారు. భారీ సంఖ్యలో మహిళలు సహస్రనామ కుంకుమార్చన చేశారు. ఆలయ అర్చకుడు భోగాపురపు ప్రసాదశర్మ పర్యవేక్షణలో పూజలు జరిగాయి. అమ్మవారికి కేసరిని ప్రసాదంగా సమర్పించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎన్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పార్వతీశ్వరాలయంలో సరస్వతీ దేవి


లలితా పీఠంలో విద్యాలక్ష్మిగా పద్మావతి


శ్రీలలితా పీఠంలో సరస్వతీ దేవిగా లలితాదేవి


సీతన్న గార్డెన్స్‌లో సరస్వతీ దేవి అలంకరణలో దుర్గమ్మ


పాత రేసపువానిపాలెంలో సరస్వతీ దేవిగా దుర్గాదేవి


మురళీనగర్ ఆలయంలో సరస్వతీ దేవిగా లలితాదేవి

## కొండవాలు సమస్యలపై మేయర్‌కు వినతి

**కంచరపాలెం:** జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత సోమవారం పీజీఆర్‌ఎస్‌లో మేయర్ పీలా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. వార్డులోని న్యూశ్రీనివాస్‌నగర్, ఇందిరానగర్-3లో పేదలకు అందుబాటులో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, సీసీ కెమెరాలు, నూతన సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

## వాహనాల చోరీ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

**తాటిచెట్లపాలెం:** నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న కేసులో ఇద్దరు ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాలిలా.. కె.కార్తీక్, ఎస్.బాబులు అనే ఇద్దరు వ్యక్తులు టూవీలర్ల చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయిలకు జైలు శిక్ష, జరిమానా విధించారు. ఫోర్త్ టౌన్ సీఐ జి.రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ సిహెచ్.అచ్యుతరావు కేసు దర్యాప్తు చేశారు. ఏపీపీ విమల్ రాథోడ్ ఈ కేసు వాదనలు వినిపించారు.

## పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలకు మేలు


కార్యక్రమంలో పాల్గొన్న శ్యామలదీపిక, డాక్టర్ దివ్య, అంగన్‌వాడీ సిబ్బంది

**కంచరపాలెం:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందిపుచ్చుకుని ఆరోగ్యంగా ఉండాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్యామలదీపిక, అగర్వాల్ అన్నారు. 47వ వార్డు కప్పరాడ పీహెచ్‌సీ వద్ద ఐసీడీఎస్, వైద్యాధికారుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోషణ మహా, స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.జ్యోతి, డాక్టర్లు దివ్య, గౌతమీ, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.